క్లుప్తంగా

నేడు బీటీ రోడ్డు ప్రారంభోత్సవం

మద్దికెర: ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం సాయంత్రం 4 గంటలకు మద్దికెరకు వస్తున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు సోమవారం తెలిపారు. గ్రామంలో రూ.2.50 కోట్లతో పూర్తి చేసిన మద్దికెర – బొజ్జనాయునిపేట తారు రోడ్డు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: హొళగుందలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు సోమవారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొచ్చి గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకుని 90 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మణిపూర్ బాధితులకు విరాళం



మణిపూర్‌కు చెందిన పాస్టర్‌కు విరాళం అందిస్తున్న స్థానిక పాస్టర్ల సంఘ పెద్దలు

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్ బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన పాస్టర్ల కమిటీ చేయూతనందించింది. స్థానిక సెయింట్ ఆండ్రూస్ సీఎస్‌ఐ చర్చిలో సోమవారం పాస్టర్ల కమిటీ సేకరించిన రూ.1,38,970 విరాళాన్ని మణిపూర్ నుంచి వచ్చిన పాస్టర్ పావోటిన్ తాంగ్ చాంగ్లెకు కమిటీ డివిజన్ చైర్మన్ రెవరెండ్ చినబాబు, కార్యదర్శి ఏసుదాదు, కోశాధికారి రుబెన్ అందజేశారు. మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సెయింట్‌పాల్ సీఎస్‌ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ జీవన్‌కుమార్, ఆయా సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఎమ్మిగనూరులో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఎయిడ్స్ నివారణపై మంజుల కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి, వ్యాపించే విధానం తదితర అంశాలు, వ్యాధి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం సభ్యులు నాటిక ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో విజయమహిళా మండలి డైరెక్టర్ వేణుగోపాలాచారి, మేనేజర్ దేవేంద్ర, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి ఒక రోజు ముందుగానే పంపించాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

పెన్షనర్లకు ఉచిత వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు, వైద్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి, జీర్ణ కోశ సంబంధ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు మోడరన్ కంటి వైద్యశాల, కామినేని ఆసుపత్రి సౌజన్యంతో వైద్యులు 128 మందికి పైగా కంటి పరీక్షలు చేయగా 16 మందిని శస్త్ర చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అదేవిధంగా 52 మందికి ఈసీజీ పరీక్షలు చేశారు. శిబిరాన్ని సంఘ అధ్యక్షులు ఏపీ వీరన్న, ఆయా ఆసుపత్రుల వైద్యులు చంద్రశేఖర్, సుచిత్‌రెడ్డి, హరి ప్రారంభించగా సంఘ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలు సుందరీబాయ్, కోశాధికారి పోలుకంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- పథకాల అమలులో తండ్రిని మించిన సీఎం వైఎస్ జగన్
- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- తెలుగుదేశం పార్టీ జన్మభూమి కమిటీలతో దోచుకుందని ఎమ్మెల్యే విమర్శలు



డ్వాక్రా మహిళలకు రూ.4.17 కోట్ల ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల డ్వాక్రా సంఘాలకు అసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా పొదుపు సంఘాలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చాడని తెలిపారు. ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు తెరిస్తే అబద్ధాలేనని, ఆయన అమలు చేసిన పథకం పేరు ఒక్కటైనా చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారుడి ఇంటికే చేరుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

వలంటీర్ల సేవలు చిరస్మరణీయం

గ్రామ/వార్డు వలంటీర్లు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉత్తమ వలంటీర్లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు సేవలందిస్తున్నారని, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకే చేరుస్తున్నారని ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మండల అధ్యక్షులు గొల్ల కేశన్న, ఉపాధ్యక్షులు పాలయ్య, నాయకులు రాజశేఖర్, నజీర్‌అహమ్మద్, బుట్టా నీలకంఠ, భీమిరెడ్డి, ఎంపీడీఓ కొండన్న, ఏపీఎం శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ.. జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. ముఖ్యమంత్రి మాట ఇస్తే నెరవేర్చి తీరతారని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు మధ్యవర్తి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుడికి చేరుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



థ్యాంక్యూ సీఎం ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న డ్వాక్రా మహిళలు



కృష్ణగిరిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వలంటీర్ల సేవలు అమూల్యం

- పేదలకు సేవ చేయడమే లక్ష్యం కావాలి
- జగనన్న ఆశయం కోసం పనిచేయండి
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతుండమే గాకుండా అవినీతి రహిత పాలన అందించడం జరుగుతోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను కృష్ణగిరిలో వలంటీర్లకు సోమవారం ఎమ్మెల్యే, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో సాకారమైందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అండగా నిలిచారని, వారి సేవలకు గుర్తింపుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏటా అవార్డులు అందించి సత్కరిస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంతోపాటు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. నిత్యం సమాజసేవలో పని చేస్తున్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం సేవా పురస్కారాల కింద సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేలు ప్రోత్సాహక నగదును వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలులో గ్రామ వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుశీల, ఎంపీటీసీలు మహాలక్ష్మి, కృష్ణయ్య, ఎల్లమ్మ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మాధవరావు, కృష్ణగిరి, మండల కో–ఆప్షన్ మెంబర్ నక్కషాలు, ఈఓఆర్డీ మురళీమోహన్, ఏఓ రామస్వామి, నాయకులు జయరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, సుదర్శనాచారి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

కృష్ణగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జింకల చిన్నన్న గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం ఆ ఇంటికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అవయవదాత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): కర్నూలుకు చెందిన పావనీలత బ్రెయిన్‌డెడ్ కావడంతో తల్లిదండ్రులు ఆమె అవయవాలను దానం చేసేందుకు సమ్మతించగా ఈనెల 6న ఆరుగురికి పునర్జన్మ లభించినట్లయ్యింది. మూడేళ్ల క్రితం తండ్రి చనిపోగా తల్లి పావనీలత మరణంతో ఐదేళ్ల చిన్నారి జ్యోష్ణ అనాథగా మారింది. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ అవయవదానంపై అవగాహన కల్పిస్తూనే చిన్నారి జ్యోష్ణను ఆదుకునేందుకు సంకల్పించింది. సోమవారం వెల్దుర్తి పాతబస్టాండులో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ట్రెజరర్ జూలకంటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులతో కలిసి అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో నిధులు సమీకరించారు. వసూలైన రూ.25 వేల నగదును ఏఎస్‌ఐ బాలకృష్ణ చేతుల మీదుగా చిన్నారి జ్యోష్ణ బ్యాంకు అకౌంట్‌కు పంపించేలా చర్యలు తీసుకున్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రముఖులు, దాతలు దశరథ రామిరెడ్డి, కేపీ ఆచారి, కిరణ్, హరిసింహనాయుడు, అమీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు. చిన్నారి జ్యోష్ణకు ఆర్థిక సాయం చేయదలచిన వారు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి 81212 12440 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



చిన్నారి జ్యోష్ణ ఖాతాకు రూ.25 వేలు చేరేలా ఏఎస్‌ఐ బాలకృష్ణకు చెక్కు అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

పెళ్లికి దాచిన సొమ్ము బూడిదపాలు

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామంలో కటిక మోహన్ ఇంట్లో సోమవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లింది. బంగారం 8 తులాలు, వెండి 20 తులాలు, రూ.6 లక్షలు దాకా నగదు కాలి బూడిదైందని బాధితుడు కటిక మోహన్‌రావు, నాగేశ్వరావు వాపోయారు. తమ చెల్లి పెళ్లి ఉండడంతో నగదును అప్పుగా ఇతరుల నుంచి తీసుకొని, బంగారాన్ని కొనుగోలు చేసి ఇంట్లోని పెట్టెలో దాచుకోవడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మొత్తం కాలి బూడిదయ్యిందని కన్నీరుమున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన నగదు, బంగారు, వెండి నగలు

సచివాలయాల పరిధిలోనే సమస్యలు పరిష్కరించండి

తుగ్గలి: ప్రజలు సమస్యలు గ్రామ సచివాలయాల పరిధిలోనే పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం వంటి వాటిపై సమీక్ష చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ గోపాల్ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు జొన్న కొనుగోలు

హాలహర్వి: జొన్నలకు బహిరంగ మార్కెట్ ధర చాలా తక్కువగా ఉందని, ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.3180 చొప్పున కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి శివశంకర్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలో రబీ సీజన్‌లో రైతులు పండించిన జొన్న దిగుబడులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో జొన్నలు క్వింటం ధర రూ.2500 నుంచి రూ.2700 దాకా ఉందని, ప్రభుత్వ ధర రూ.3180 ఉందని చెప్పారు. రైతులు గిట్టుబాటు ధరకు జొన్నలను విక్రయించి ప్రయోజనం పొందాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 1985 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆర్‌బీకే సిబ్బంది వెంట ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

నందవరం: మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి జి.వీరేష్ ఈఈఎంటీ –2024 పరీక్షలో ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్‌లో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ విద్యార్థికి మెమోంటో, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ నెల 8వ తేదీన ఎడ్యుకేషన్ ఎఫోర్ని ఎన్‌జీఓ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈఈఎంటీ ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్ష నిర్వహించగా జి.వీరేష్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానం పొందాడు. దీంతో 17వ తేదీన విజయవాడలో పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ (ఐఏఎస్), ఈఈఎంటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ దూదేకుల నబీ చేతుల మీదుగా రూ.3 వేలు నగదు, ప్రశంసా పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థి వీరేష్‌ను అభినందించారు.



విద్యార్థి జి.వీరేష్‌కు మెమోంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

నేటి నుంచి దస్తగిరిస్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ కొండపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు నాగదేవత పూజ, గవిలో పూజ, అభయాంజనేయస్వామి పూజ, దర్గాలో పూలసేరా, పోతప్ప పూజలు నిర్వహించనున్నారు. 21న తెల్లవారుజామున గంధోత్సవం, 22న షంషేర్ ఉత్సవం జరుగుతాయన్నారు.

రేపు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం 4 పళ్ల ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి ఆరుగురు విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు నగదు బహుమతి అందించనున్నామన్నారు. పాల్గొనదలచిన వారు 63033 86356, 95025 52533 నంబర్లను సంప్రదించాలని కోరారు.

– అలాగే బుధవారం నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించనున్నారు. విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు అందించనున్నారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు 80086 65793, 91772 57589 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైభవంగా రథోత్సవం



హోసూరులో అశేష భక్తజనం మధ్య రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామంలో భద్రకాళీ వీరభద్ర స్వామి రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని ఆలయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం అశేష భక్తజనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామం కిక్కిరిసింది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ నారాయణదాస్ రథోత్సవంలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మురళీమోహన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

దేవనకొండలో బాలుడికి డెంగ్యూ

దేవనకొండ: దేవనకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని నగరి వీధిలో ఆరు సంవత్సరాల బాలుడికి డెంగ్యూ నిర్ధారణ అయినట్లు సబ్ యూనిట్ అధికారి సాయిబాబా సోమవారం తెలిపారు. దీంతో ఆ వీధిలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రంగస్వామి, ఏఎన్‌ఎం మాదమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రస్తా ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రాస్తాను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గంజహళ్లి మహదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామస్తులతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఎలిశమ్మ ఇంటి ముందు అదే గ్రామానికి చెందిన తిక్కయ్య అనే వ్యక్తి రస్తాను ఆక్రమించుకొని గోడను నిర్మించడమే గాకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అతనిపై చర్యలు తీసుకొని రస్తాలో కట్టిన గోడను తొలగించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఈఓఆర్డీ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రేమరాజ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

విద్యుత్ లైన్‌మెన్ సస్పెన్షన్

ఆలూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కరిడిగుడ్డం ఫీడర్ లైన్‌మెన్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదోని ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన కరిడిగుడ్డం సమీపంలో వ్యవసాయ బోరు కనెక్షన్ వైర్లు లాగుతూ.. విద్యుత్ కార్మికుడు దివాకర్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడి బళ్లారి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైన్‌మెన్ చంద్రశేఖర్ బోరు కనెక్షన్ కోసం విద్యుత్ లైన్ లాగుతున్న ప్రదేశంలో ఉండకుండా ఫోన్‌లో మాట్లాడి ఎల్‌సీ తీసుకున్నాడు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి ప్రమాదానికి కారణమైన లైన్‌మెన్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు ఆసరా సంబరాలు

గోనెగండ్ల: ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మంగళవారం గోనెగండ్లకు వస్తున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ స్థానిక బాషా ఫంక్షన్ హాలులో వైఎస్సార్ ఆసరా సంబరాలతో పాటు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక హాజరవుతారని చెప్పారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, పొదుపు మహిళలు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

వలంటీర్లకు నేడు పురస్కారాల ప్రదానం

చిప్పగిరి: సేవా పురస్కారాలకు ఎంపికైన గ్రామ వలంటీర్లను మంగళవారం ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ బరెన్ సాహెబ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 147 మంది వలంటీర్లు సేవా పురస్కారాలకు ఎంపికయ్యారని, వీరిలో ఐదుగురు సేవా రత్న, 142 మంది సేవా మిత్ర పురస్కారాలు అందుకోనున్నట్లు చెప్పారు.

కనులపండువగా లంకాదహనం



సిద్ధప్ప, సిద్ధమ్మను పల్లకీలో ఉంచి పూజలు చేస్తున్న దృశ్యం



మిరమిట్లు గొలుపుతున్న బాణసంచా వెలుగులు

హొళగుంద: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు గ్రామాల ఇలవేల్పు సిద్ధేశ్వర స్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లంకాదహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, నిర్వాహకులు శివశంకర్‌గౌడ్, సిద్దార్థగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తులను అమితంగా ఆకట్టుకుంది.

రమణీయంగా సిద్ధప్ప, సిద్ధమ్మ కల్యాణోత్సవం

అంతకుముందు ఆలయ పూజారులు సిద్ధప్ప, సిద్ధమ్మ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం సిద్ధమ్మను ఆలయంలో ఉంచి సిద్ధప్పమూర్తిని పల్లకీలో అదిష్టించి ఆలయం చుట్టూ, తేరు బజారులో ఊరేగింపు జరిపారు. కల్యాణనంతరం సిద్ధేశ్వరుడు విహార యాత్రకు బయలుదేరి తిరిగి విజయవంతంగా సిద్ధమ్మ వద్దకు చేరడంతో ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడమే ఈ లంకాదహన కార్యక్రమమని ధర్మకర్త రాజ పంపన్నగౌడ్ తెలిపారు. ఉత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరైయ్యారు. రూ.లక్షల విలువ చేసే రకరకాల బాణసంచాను కాల్చారు. భక్తులు దాదాపు గంటల పాటు సంభ్రమాశ్చర్యాలతో తిలకించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. స్థానిక తేరువీధిలో 'రైత అచ్చిద రక్త సింధూర' అనే కన్నడ సామాజిక నాటక ప్రదర్శన జరిగింది. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి స్వామివారిని దర్శించున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తలు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

వైభవంగా కనకదాసు విగ్రహ ప్రతిష్ట



ముద్దటమాగిలో కనకదాసు విగ్రహానికి పూజలు చేస్తున్న విరూపాక్షి

హొళగుంద: మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో కురువల ఆరాధ్య దైవం భక్త కనకదాసు నూతన విగ్రహ ప్రతిష్టాపన, ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం స్థానిక కురువ కులపెద్దలు, భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కృష్ణమోహన్, ఆమె భర్త కృష్ణమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కనకదాసు విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేద పండితులు జలాదివాస, వస్త్రాదివాస, ధాన్యదివాస, పుష్పదివాస, శయనాదివాసతో పాటు హోమాలు, రుద్రాభిషేకం, ఆకుపూజ, ఇతర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కురువ కుల పెద్దలు, నాయకులు బీరప్ప, గాదిలింగప్ప, లింగన్న, నెరణికప్ప, వెంకటేష్, గర్జప్ప, చాగప్ప, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.